

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం: 33.0 కనిష్ఠం: 28.0
తణుకు: 34.0 - 27.0



డ్రైవర్ల వాగ్వాదం



మార్టేరులో మాల మహానాడు మానవహారం

బంద్ విజయవంతం

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త పిలుపు మేరకు మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. గ్రామాలు, పట్టణాల్లో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు మూతపడ్డాయి. బస్సుల రాకపోకలు నిలిపివేశారు. పలుచోట్ల మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు ధర్నాలు, మానవహారాలు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు బంద్ ప్రభావం కనిపించింది. సాయంత్రం నుంచి దుకాణాలు తెరుచుకున్నాయి. భీమవరంలో సాయంత్రం ఒక్కసారిగా రద్దీ పెరిగింది. ఒక దశలో పట్టణంలో ట్రాఫిక్ స్తంభించింది. వెంకట్రామా థియేటర్ రోడ్డులో కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. అంబేడ్కర్ సెంటర్‌లో వాహన డ్రైవర్లు వాగ్వాదానికి దిగి, కొట్టుకునే వరకు వెళ్లారు. పోలీసులు పరిస్థితిని అదుపు చేశారు. 8లో..



భీమవరం ట్రాఫిక్‌లో నిలిచిన వాహనాలు

రిజిస్ట్రేషన్ విలువ పెంచేద్దాం

ప్రతిపాదనలకు ఉన్నతాధికారుల ఆదేశం



గడచిన ఐదేళ్లలో రిజిస్ట్రేషన్‌ల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఫలితంగా ఆ శాఖ ఆదాయం పడిపోయింది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం కుదేలైంది. వైసీపీ హయాంలో రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ పెంచినా ఫలితం లేకపోయింది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వ పాలన రిజిస్ట్రేషన్ శాఖకు మంచి రోజులేనని ఆశిస్తున్న తరుణంలో మార్కెట్ విలువను పెంచుతూ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఆ దిశగా జిల్లాలో కసరత్తు చేస్తున్నారు. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో 10 నుంచి 30 శాతం మార్కెట్ విలువ పెంచేలా రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు దిశా నిర్దేశం చేశారు. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులు సూచించినా ప్రభుత్వం అనుమతి ఇస్తేనే మార్కెట్ విలువ పెంపు అమలులోకి రానుంది.

భీమవరం-ఆంధ్రజ్యోతి

- జిల్లాలో 10 నుంచి 30 శాతం పెంచాలంటూ దిశానిర్దేశం
- పది శాతానికి మొగ్గు చూపుతున్న సిబ్బంది
- ప్రతిపాదనల్లో తలమునకలు
- ప్రభుత్వం ఆమోదిస్తేనే అమలు

జిల్లాలో పంట భూములు, స్థలాల విలువ పెంచుతూ ప్రతిపాదనలు రూపొందించనున్నారు. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో 10 శాతం పెంచేందుకు క్షేత్రస్థాయిలో సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. అంతకు మించి పెంచితే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని సంశయిస్తున్నారు. భూములు, స్థలాల క్రయ విక్రయాలు జోరందుకుంటే కాస్త విలువ పెంచినా పెద్దగా ఇబ్బంది ఉండదు. భూముల ధరలు పెరిగితే రిజిస్ట్రేషన్ విలువ పెంచినా వ్యతిరేకత అంతగా ఉండదు. వైసీపీ హయాంలో భూముల ధరలు తగ్గిపోయాయి. పంట భూములు ఎకరం విలువ రూ. 50 లక్షల నుంచి రూ. 40 లక్షలకు తగ్గినా అమ్మకాలు జరగలేదు. మరోవైపు అప్పట్లోనే పట్టణాల్లో కనిష్ఠ విలువ భారీగా పెంచేశారు. భీమవరంలో చదరపు గజానికి కనిష్ఠ విలువ రూ. 15వేల వరకు ఉంది. తాడేపల్లిగూడెంలో రూ. 13వేలు, తణుకులో రూ. 11వేలు అమలు చేస్తున్నారు. పాలకొల్లులో రూ. 14వేల వరకు కనిష్ఠ విలువ ఉంటే గరిష్ఠం రూ. 47 వేల వరకు ఉంది, భీమవరంలో గరిష్ఠ విలువ రూ. 2 లక్షలకు పైనే ఉంటోంది. నరసాపురంలో కనిష్ఠ ధర రూ.7వేలకు పైగా అమలు చేస్తున్నారు. గరిష్ఠ విలువ ప్రతి పట్టణంలో లక్షకుపైనే ఉంది. ఇప్పుడు మరో 10 శాతం పెంచి ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు. కనిష్ఠ విలువ కూడా పెరగనుంది. పట్టణ సమీప గ్రామాల్లో కూడా వైసీపీ హయాంలో భారీగానే పెంచేశారు. ప్రస్తుతం పెంపు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతిస్తే పెంపు ప్రతిపాదనలు కలెక్టర్ ద్వారా అమలులోకి రానున్నాయి.

రిజిస్ట్రేషన్ విలువ కంటే మార్కెట్ ధర తక్కువ!

పట్టణాల్లో రిజిస్ట్రేషన్ విలువ కంటే మార్కెట్ ధర తక్కువగా ఉన్న ప్రాంతాలు కూడా ఉన్నాయి. జిల్లా కేంద్రమైన భీమవరంలో ఇటువంటి లొసుగులు ఎక్కువగా ఉన్నాయి. బ్యాంకుల నుంచి రుణాలు అధికంగా పొందేందుకు రిజిస్ట్రేషన్ విలువను పెంచడంలో భీమవరంలోని వ్యాపారులు చక్రం తిప్పారు. కొన్నేళ్ల క్రితమే ధరలను పెంచేశారు. అప్పటి నుంచి దానిపై పెంచుకుంటూ రావడంతో మార్కెట్‌లో బహిరంగ విలువ కంటే రిజిస్ట్రేషన్ విలువ అధికంగా ఉన్న ప్రాంతాలు భీమవరంలో ఉన్నాయి. ఇటువంటి వాటిపై రిజిస్ట్రేషన్ శాఖ దృష్టి పెట్టాల్సి ఉంది. వాస్తవితకు దగ్గరగా రిజిస్ట్రేషన్ విలువను నిర్ధారించాలి. పట్టణాల్లో తలెత్తిన తప్పిదాలను సరిదిద్దాలి. అలా కాకుండా ఉన్నతాధికారులు ఒత్తిడి మేరకు పెంపు ప్రతిపాదనలు సిద్ధం చేస్తుంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదికూడా భూములు, స్థలాల క్రయవిక్రయాలపై ప్రభావం చూపుతున్నాయి.

విలువ పెంపుతో ఆదాయం పెరగనుందా?

భూములు, స్థలాల రిజిస్ట్రేషన్ విలువ పెంచితే ప్రభుత్వానికి ఆదాయం పెరగాలి. వైసీపీ హయాంలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం జిల్లాలో భారీగా తగ్గింది. తణుకులో 60 శాతం మేర లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమైంది. అదే బాటలో ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆదాయం గణనీయంగా పడిపోయింది. జిల్లా వ్యాప్తంగా 75శాతం మేర లక్ష్యాన్ని చేరుకోవడానికి ఆపసోపాలు పడ్డారు. జిల్లాలో ఏడాదికి రూ. 571 కోట్లు సమకూరాల్సి ఉండగా గత ఏడాది రూ. 400 కోట్లు ఆదాయం రావడం కష్టమైంది. ధరలు పెంచినా సరే లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. ప్రతి ఏటా ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను చేరుకుంటారు. వైసీపీ హయాంలో 70 శాతానికి మించి ఆదాయం రాలేదు. ఒక్కోసారి 60 శాతానికి పడిపోయిన సందర్భాలున్నాయి. ప్రభుత్వం మరోసారి ధరలు పెంచితే ఆ ప్రభావం ఎలా ఉంటుందనే విషయమై క్షేత్రస్థాయిలో రిజిస్ట్రేషన్ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. రియల్ ఎస్టేట్ రంగం జోరందుకుంటేనే సత్ఫలితాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు.

రిజిస్ట్రేషన్‌కు రీ సర్వే అడ్డంకులు



ఆచంట, ఆగస్టు 21: ఏడాది క్రితం ప్రభుత్వం చేపట్టిన వ్యవసాయ భూముల రీసర్వే ప్రస్తుతం ముప్పుతిప్పలు పెడుతోంది. కొన్ని చోట్ల క్రయ విక్రయ రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడానికి కారణమైంది. రీసర్వే అనంతరం కేటాయించిన ఎల్‌పీ నెంబర్ రిజిస్ట్రేషన్లకు అడ్డంకిగా మారింది. సర్వే చేసిన అనంతరం అధికారులు ఎల్‌పీ నెంబర్లను కేటాయించారు. ఎల్‌పీ నెంబరు కేటాయించిన భూముల సర్వే నెంబర్‌లకు సంబంధించి కొన్ని నెలలుగా రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. ఆచంట సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ఆచంట, పెనుగొండ, పోడూరు మండలాల్లో 20 గ్రామాలు ఉన్నాయి. ఆచంట మండలం కొడమంచిలి, కరుగోరుమిల్లి, పెనుమంచిలి, పోడూరు మండలంలో రావిపాడు, మినిమించిలిపాడు, పెనుగొండ మండలంలో ములపర్రు గ్రామాల రీసర్వే నెంబర్లకు సంబంధించి ఎల్‌పీ నెంబరు కేటాయించడంతో ఈ గ్రామాల రిజిస్ట్రేషన్‌లు సుమారు ఏడు నెలలు క్రితమే నిలిచిపోయాయి. ఇంటిలో వారికి సెటిల్‌మెంటు దస్తావేజు, వివాహ దస్తావేజులు రాయాలన్నా రిజిస్ట్రేషన్ జరగడం లేదు. దీని కారణంగా ప్రభుత్వానికి వచ్చే రెవెన్యూ కూడా గణనీయంగా పడిపోయింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ ఐదు గ్రామాలకు ఎల్‌పీ నెంబ ర్లు కేటాయించడంతో కొంతమంది కక్షిదారులు అసహనం వ్యక్తం చేశారు. సజావుగా రిజిస్ట్రేషన్‌లు జరగాలంటే తిరిగి మార్కెట్ విలువ మదింపు వివరాలను ఉన్నతాధికారులకు పంపించాలి. అపుడు మాత్రమే ఈ గ్రామాలకు సంబంధించి వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్ అయ్యే అవకాశం ఉంది. ఎల్‌పీ నెంబర్లకు సంబంధించి రిజిస్ట్రేషన్‌శాఖ ఉన్నతాధికారులు రెండు, మూడు సమావేశాలు నిర్వహించినా స్పష్టత రాలేదు. గత ప్రభుత్వంలో గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో మండలంలో కందరవల్లికి సంబంధించి ఎల్‌పీ నెంబరు కేటాయించడంతో సచివాలయం, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌లు జరిగేవి. కూటమి ప్రభుత్వం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ రద్దు చేయడంతో నిలిచిపోయాయి. రీసర్వే అయిన గ్రామాలకు 1బి ఫారంలో ఇటీవల ఎల్‌పీ నెంబరు కేటాయించారు. ఒకే ఎల్‌పీ నెంబరుతో రెండు మూడు సర్వే నెంబర్లు ఉండడంతో క్రయవిక్రయాలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనిపై అధికారులు ప్రతీ సర్వే నెంబరుకు ఎల్‌పీ నెంబరు కేటాయిస్తేనే రిజిస్ట్రేషన్‌లు సజావుగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పది రోజులుగా నిలిచిన రిజిస్ట్రేషన్లు

ఆచంట మండలం పెదమల్లంలో భూముల రీసర్వే చేయలేదు. అయినప్పటికి పది రోజులుగా ఈ గ్రామానికి సంబంధించి రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. సర్వే నెంబరుకు సంబంధించి డేటా వివరాలు అందుబాటులో లేకపోవడంతో రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. సంబంధిత అధికారులను అడిగితే సాంకేతిక సమస్య అని, రెండు, మూడు రోజుల్లో సరవుతుందని చెబుతున్నారు. కక్షిదారులకు ఇబ్బందులు లేకుండా సజావుగా రిజిస్ట్రేషన్ జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

రేపు గ్రామసభలకు సిద్ధం

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 21: రాష్ట్రంలో ఈనెల 23న ఒకేరోజు నిర్వహించే గ్రామ సభలను విజయవతంగా నిర్వహించాలని, ప్రతీ గ్రామసభకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగరాణి పాల్గొన్నారు. ఉపాధి హామీపై ప్రజల్లో అవగాహన కల్పించడం తోపాటు గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, అంతర్గత రహదారుల నిర్మాణం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామసభలను ఉపయోగించాలని సీఎస్ స్పష్టం చేశారు.

11 నుంచి నూతన ఇసుక విధానం

రాష్ట్రంలో సెప్టెంబరు 11 నుంచి నూతన ఇసుక విధానాన్ని అమలులోకి తేనున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వెల్లడించారు. స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేస్తామని, తూచా తప్పక పాటించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇసుక రీచ్ వారీగా ఇసుక తవ్వకం, రవాణాకు సంబంధించిన ధరలను కలెక్టర్లు నిర్ధారించాలని, ఆ ధరలకు మించి ఎక్కువ ధరకు విక్రయించినట్టు ఫిర్యాదులు వస్తే ఎంత మాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు.

హైవే నిర్మాణానికి నివేదిక ఇవ్వండి

భీమవరం టౌన్ : ఆకివీడు నుంచి దిగమర్రు జాతీయ రహదారి -165 నిర్మాణంపై నివేదిక త్వరితగతిన అందజేయాలని కలెక్టర్ నాగరాణి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్‌హెచ్-165, ఆర్అండ్‌బి, రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్ అధికారులతో బుధవారం కలెక్టర్ నాగరాణి, జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి సమీక్షించారు. ఆకివీడు నుంచి దిగమర్రు పరిధిలో 45 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి ఎన్‌హెచ్ అధికారులు ఇప్పటికే రూపొందించిన మూడు అలైన్మెంట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రహదారులు భవనాలు, విద్యుత్, ఇరిగేషన్, రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వారం రోజుల్లో పూర్తి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

రేపు ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూ

నరసాపురంలో ఈ నెల 23న నిర్వహించే ఉద్యోగ దిక్సూచి ఇంటర్వ్యూలకు ఏర్పాట్లుచేయాలని కలెక్టర్ నాగరాణి అధికారులను ఆదేశించారు. నైపుణ్య అభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, జిల్లా పరిశ్రమలు, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఎక్కువమంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరై ఉద్యోగాలు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

బిందు సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం


జిల్లాలో 1500 హెక్టార్లకు విస్తరించాలని లక్ష్యం



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో బిందు సేద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం బిందు సేద్యంపై పూర్తి నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యాన పంటల్లో బిందు సేద్యంపై దృష్టి సారించించింది. జిల్లాలో ఈ ఏడాది 1500 హెక్టార్లలో బిందు సేద్యం చేపట్టాలని లక్ష్యం విధించింది. ప్రధానంగా కొబ్బరి, పామాయిల్, జామ, నిమ్మ, బత్తాయి తోటలకు బిందు సేద్యం ప్రయోజనం. రైతులు ఎంత విస్తీర్ణంలోనైనా సాగుచేసే వెసులుబాటు కల్పించారు. ఐదు ఎకరాలలోపు సాగు చేస్తే 90శాతం, ఆ పైన సాగు చేపడితే 50 శాతం రాయితీ ఇవ్వనున్నారు. రైతు ఆసక్తి చూపితే కంపెనీ ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వ్యయాన్ని అంచనా వేస్తారు. తాడేపల్లిగూడెం రూరల్, మొగల్తూరు, నరసా పురం, పాలకొల్లు నియోజకవ ర్గాల్లో బిందు సేద్యంపై అధికారులు దృష్టి పెట్టారు. మొగల్తూరు ప్రాంతాల్లో విస్తీర్ణంతో సంబంధం లేకుండా 90 శాతం రాయితీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

1 నుంచి ఏలూరులో వందే భారత్ హాల్ట్ !



ఏలూరు టూ టౌన్, ఆగస్టు 21: విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఏలూరు స్టేషన్‌లో ఆగనుంది. వచ్చే నెల 1 నుంచి హాల్ట్ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజల డిమాండ్ మేరకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి హాల్ట్ విషయమై విజ్ఞప్తి చేశారు. ఆయన కృషి ఫలించింది. ఈ మేరకు ఏలూరులో రైలు నిలుపుదలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. రైల్వే బోర్డు జాయింట్ డైరెక్టర్ వివేక్‌కుమార్ సిన్హా బుధవారం ఉత్తర్వుల కాపీని ఎంపీకి అందజేశారు. ఏలూరు రైల్వే స్టేషన్ అధికారులకు బుధవారం సాయంత్రం ఉత్తర్వులు అందాయి. రైలు నిలుపుదల, ప్రయాణి కులకు అవసరమైన సౌకర్యాలు, స్థితిగతులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు వెలువడ్డాయి. అధికారులు రైల్వే ప్లాట్‌ఫామ్, టిక్కెట్ కౌంటర్లు, ఇతర సదుపాయాలు, తదితర అంశాలు పరిశీలించారు.

కడగండ్లు

ఎర్రకాల్వ గట్లు బలహీనం

మరమ్మతులకు సరిపడని నిధులు



మాధవరంలో గట్టు లేని ఎర్రకాలువ

ఎర్ర కాల్వ వరదలకు తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం, మాధవరం, పట్టింపాలెం, జగన్నాధపురం, మారంపల్లి, నందమూరు గ్రామాల్లోని వరి చేలు నీట మునిగాయి. పంట భూముల్లో ఇసుక మేటలు వేశాయి. రైతులకు ఎర్రకాల్వ వరదలకు నష్టపోయిన వరిపంట నష్టంకంటే ఇసుక మేటలు తొలగించడానికయ్యే వ్యయం అధికమవుతున్నది.



విరిగిపడుతున్న గట్టు

ఎర్ర కాల్వ పరీవాహక రైతులకు ఏళ్లనాటి నుంచి కడగండ్లు తప్పడం లేదు. ఏటా వర దలతో పంట నష్టం పరిపాటి అయింది. గత వైసీపీ ప్రభుత్వం ఎర్ర కాల్వ మరమ్మతులకు చిల్లిగవ్వ ఇవ్వలేదు. ఇటీవల వరదలతో పడిన గండ్లు పూడ్చకపోవడంతో నష్టం రెట్టింపు అయింది. వేలాది ఎకరాల్లో వరి పంట దెబ్బ తింది. వరద నీరు నేరుగా చేలల్లోకి చేరడంతో ముంపుతో పాటు చేలల్లో ఇసుక మేటతో పంట నష్టంతో పాటు మేటలు తొలగించడం మరింత భారమవుతోంది.

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 21: గతంలో ఎర్ర కాల్వకు పడిన గండ్లు మాటెలా ఉన్న ఈ సారి వరద ఉధృతికి గట్లు మొత్తం గుల్లయ్యాయి. ఎర్ర కాలువ సమస్య మరింత జటిలమైంది. రాబోయే రోజుల్లో ఎర్రకాల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని పరీవాహక రైతులు వేడుకుంటున్నారు.

వరద నీటిని మళ్లించాలి

ఎర్ర కాలువ వరద నీరు ఉధృతంగా ఉన్న సమయంలో నీటిని మళ్లించే చర్యలు చేపడితే దిగువ పంటకు ముప్పు తప్పుతుంది. నల్లజర్ల మండలం నబీపేట వద్ద తాడిపూడి, పోలవరం కాలువలకు మళ్లించే ఏర్పాట్లుచేస్తే వరద ఉధృతిని తగ్గించేందుకు వీలుంటుందని ఇరిగేషన్ నిపుణులు చెబుతున్నారు.

వరద మరమ్మతు నిధులు రూ.53 లక్షలు

ఇటీవల వచ్చిన వరదలకు దెబ్బతిన్న ఎర్రకాల్వ గట్ల మరమ్మతులకు రూ. 53.62 లక్షల నిధులు విడుదల చేశారు. ఈ నిధులు గట్ల మరమ్మతులకు ఏమాత్రం సరిపోవని, గట్లు పటిష్టం చేసేందుకు ప్రయత్నించినా ఆ నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారుతుందని రైతులు చెబుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

గతంలో వచ్చిన ఎర్రకాల్వ వరదలకు తూట్లు పడిన గట్లకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలోనే గట్లు పటిష్టానికి, బ్రిడ్జి నిర్మాణాలకు రూ.100 కోట్లు ఖర్చుచేసినా కాల్వల్లో ఉన్న మెలికల వల్ల వరదనీరు మలుపులకు కొట్టి గట్లు దెబ్బతిన్నాయి. అది పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. అనంతపల్లి నుంచి నందమూరు వరకూ 22 మలుపులు ఉండగా వాటిని సరిచేసి కాలువ పటిష్టం చేయాలని సూచిస్తున్నారు.

సమస్యపై పాలకులు దృష్టి పెట్టాలి



ఎర్రకాల్వ సమస్యపై ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చేయాలి. ముంపు, గట్ల సమస్యపై ఉన్నతాధికారులు, పాలకులు దృష్టి సారించాలి. ఎర్రకాలువ ముంపుతో నష్టపోయిన రైతులు ఇరిగేషన్ మంత్రి రామానాయుడు దృష్టికి తీసుకెళతాం.

- కలగాని ప్రభాకర్, మాధవరం


సమావేశంలో మాట్లాడుతున్న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్

టూరిజాన్ని అభివృద్ధి చేస్తా

మంత్రి కందుల దుర్గేశ్



దేవరపల్లి, ఆగస్టు 21 : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో టూరిజాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. దేవరపల్లిలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జనసేన ఎమ్మెల్యేల ఆత్మీయ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి దుర్గేశ్ మాట్లాడుతూ 'ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పర్యాటక కేంద్రానికి అనువైన గోదావరి, ప్రధాన ఆలయాలు, అటవీ ప్రాంతం, జలపాతాలు ఉన్నాయి. వీటిని కలుపుతూ టూరిజం కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాం. జలపాతాల వద్ద రిసార్ట్స్ ఏర్పాటు చేస్తాం. 20 ఏళ్ల వరకు కూటమి ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది' అని అన్నారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ కొంత మంది అధికారులు వైసీపీ మబ్బుల్లో నుంచి ఇంకా బయటకు రాలేదని, వారు మారకపోతే చర్యలు దూకుడుగా ఉంటాయని హెచ్చరించారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేన, టీడీపీ, బీజేపీ కలిసికట్టుగా ఉండాలని, చిన్న చిన్న సమస్యలున్నా పరిష్కరించుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు, కూటమి నాయకులను నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు, పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. పలువురు వైసీపీ నాయకులు జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, జనసేన ఎమ్మెల్యేల సమక్షంలో పార్టీలో చేరారు. పోలవరం, ఉంగుటూరు ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు, కరాటం రాంబాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.39 కోట్లు



ద్వారకాతిరుమల ఆగస్టు 21 : చిన వెంకన్న ఆలయ హుండీ ఆదాయం భద్రతా ఏర్పాట్ల నడుమ బుధవారం సిబ్బంది లెక్కింపు నిర్వహించారు. గడిచిన 27 రోజుల కాలానికి నిర్వహించిన లెక్కింపులో స్వామి వారికి అధిక ఆదాయం సమకూరింది. నగదు రూపేణా 2 కోట్ల 39 లక్షల 96 వేల 220 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వేండ్ర త్రినాధరావు తెలిపారు. 145 గ్రాముల బంగారం, 6.019 కేజీల వెండి లభించినట్లు వివరించారు.

కొవ్వాడ రిజర్వాయర్ నుంచి 150 క్యూసెక్కుల జలాలు విడుదల



పోలవరం, ఆగస్టు 21 : పోలవరం మండలంలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు కొండవాగుల జలాలు కొవ్వాడ రిజర్వాయర్‌లోకి భారీగా చేరుకున్నాయి. దీంతో అధికారులు 150 క్యూసెక్కుల జలాలను ఒక గేటు ఎత్తి దిగువకు విడుదల చేశారు. రిజర్వాయర్‌లో నీటి మట్టం 89.95 మీటర్లకు చేరుకుందని సిబ్బంది తెలిపారు.


నవోదయ విద్యార్థినులతో ఏపీ నిట్ ఆచార్యులు

సామాజిక పురోగతికి విద్యే పునాది

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 21 : బాలికల వికాసానికి, సామాజిక పురోగతికి విద్యే పునాది అని ఏపీ నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వీ.సందీప్ అన్నారు. ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురం, చిలకలూరిపేట, ఒంగోలులోని జవహర్ నవోదయ పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థినులు బుధవారం నిట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ఇండోర్ స్టేడియం, ప్రయోగశాలలు, గ్రంథాలయం, వర్క్‌షాపులను పరిశీలించారు. యంత్రాల పనితీరు, వాటి ప్రాధాన్యతను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ సందీప్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే చదువుతో పాటు మిషన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్ తదితర అంశాలపై పట్టు సాధించాలన్నారు. నవోదయ విద్యాలయం అధ్యాపకులు ఎం.వెంకటేశ్వరరావు, కే.మాధురి, యామిని, బీ.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


మొక్కలు అందిస్తున్న ఉద్యాన విస్తరణ సంచాలకురాలు కరుణశ్రీ

తల్లి పేరుతో మొక్క నాటండి..

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 21: ప్రతీ ఒక్కరూ తమ తల్లిపేరుతో ఒక మొక్క నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ఉద్యాన విస్తరణ సంచాలకురాలు కరుణశ్రీ సూచించారు. వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఐసీఏఆర్ సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతులకు, నిమ్మ, వాక్కాయ, చెర్రీ మొక్కలను అందించారు. వర్సిటీ ఆవరణలో మునగ, కరోండా మొక్కలు నాటారు. శాస్త్రవేత్తలు దీప్తి, దేవి వరప్రసాదరెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ క్వార్టర్స్‌లో చోరీ

నూజివీడు టౌన్, ఆగస్టు 21: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మంగళవారం రాత్రి అధ్యాపక సిబ్బంది నివాసం ఉండే 203, 401 క్వార్టర్స్‌లో దుండగులు తలుపులు పగులగొట్టి బంగారం, నగదు అపహరించారు. సీఎస్ఈ విభాగంలో పనిచేస్తున్న పద్మాబాయ్ అనారోగ్యంతో నూజివీడు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ఈసీఎస్ విభాగంలోని ప్రియాంక ఫంక్షన్ నిమిత్తం శ్రీకాకుళం వెళ్లారు. వీరు ఇంట్లో లేరని గుర్తించిన దుండగులు పద్మాబాయ్ ఇంట్లో రూ.1.9 లక్షల నగదు, 16 గ్రాముల బంగారం, వెండి సామగ్రి అపహరించారు. ప్రియాంక ఇంట్లో చోరీ అయిన సొత్తు ఎంతనేది తెలియలేదు. ఏలూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. నూజివీడు ఎస్సై రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బంద్‌తో నిర్మానుష్యంగా మారిన ఏలూరు బస్టాండ్

నిరసన గళం :

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి..ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దళిత సంఘాలు బంద్ చేపట్టాయి. మహిళలపై అత్యాచారాలు అరికట్టాలంటూ ఏలూరులో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినూత్నంగా కళ్ళకు నల్ల రిబ్బన్‌లు కట్టుకుని ర్యాలీ చేశారు. కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు.



ఏలూరులో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును అడ్డుకున్న దళిత సంఘ నాయకులు



కోల్‌కతా వైద్య విద్యార్థిని హత్యాచారంపై నిరసనగా ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చెట్టుకి వేలాడ దీసిన తెల్లకోటుపై అరచేతి ముద్రలు



ఆలమూరులో జ్వరాల విజృంభణ

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వివిధ కారణాలతో ముగ్గురి మృతి

వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టరు నాగరాణికి ఎమ్మెల్యే పితాని ఫోన్

పెనుమంట్ర, ఆగస్టు 21 : పెనుమంట్ర మండలం ఆలమూరులో వైరల్ ఫీవర్స్ విజృంభిస్తున్నాయి. అనేకమంది విష జ్వరాలతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మరికొందరు ఆలమూరు పీహెచ్‌సీ (భట్లమగుటూరు)ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స చేయించుకుంటున్నారు.జ్వరాల బారిన పడి ప్రైవేట్ హాస్పటల్స్‌లో చేరిన ముగ్గురు చికిత్స పొందుతూ మరణించారు. దీనిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణిని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కోరారు. లండన్ పర్యటనలో ఉన్న ఆయనకు స్థానిక నాయకులు అందించిన సమాచారంతో ఆయన స్పందించి నేరుగా అక్కడి నుంచే కలెక్టర్‌తో మాట్లాడారు.

రోగులను పరిశీలించిన తహసీల్దార్

జ్వరాలతో ఆసుపత్రిలో చేరి వివిధ కారణాలతో మృతి చెందినవారి వివరాలను పెనుమంట్ర తహసీల్దార్ రవికుమార్ వైద్యులు ప్రదీప్ కుమార్, అనిల్ కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు.రాజమండ్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారని స్థానికంగా మరొకరు మృతి చెందారని వైద్యులు వివరించారు వీరిలో కాలా తిరపతయ్య (37) వైరల్ ఫీవర్‌తో జాయిన్ అయి కిడ్నీ ప్రాబ్లం ఉండటం కారణంగా మృతి చెందాడని తెలిపారు సత్తి గీత (48) జ్వరంతో బాధపడుతూ తెల్ల రక్తకణాలు క్షీణించడంతో రాజమండ్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మృతి చెందినట్లు తెలిపారు.


పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్

దిగమర్తి వెంకట నాగలక్ష్మి (45) జ్వరంతో బాధపడుతూ గుండెపోటు కారణంగా రాజమండ్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని తెలిపారు. ఆలమూరు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న పీడితులను పరామర్శించి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గ్రామంలో పారిశుధ్య చర్యలపై ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శి సుధారాణి, సిబ్బంది ఉన్నారు.

ఆలమూరు పీహెచ్‌సీలో 11 మందికి చికిత్స

ఆలమూరు పీహెచ్‌సీ (భట్లమగుటూరు)లో ఈ గ్రామం నుంచి రోజుకు వంద నుంచి 120 మంది వరకు వైద్య నిమిత్తం వస్తున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 11 మందికి వైద్యం అందిస్తున్నారు. ఆరుగురుకి టైఫాయిడ్ పరీక్షలు నిర్వహించారు. ఇప్పటి వరకు 600 నుంచి 700 మంది పరీక్షలు చేయించుకున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. 15 రోజులుగా వైద్యులు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి వైద్య సదుపాయం అందిస్తున్నా ఎందుకు జ్వరాలు అదుపులోకి రావడం లేదో వైద్యాధికారులకు అంతు చిక్కడం లేదని అంటున్నారు. దీనిపై వైద్యాధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


వరి చేల మధ్యలో చేపల చెరువు తవ్వకాలను అడ్డుకుంటున్న రైతులు

పొలాల మధ్యలో చేపల చెరువు..

మొగల్తూరు, ఆగస్టు 21: మొగల్తూరు పంచాయతీ పరిధి నక్కావారిపాలెంలో తమ చేలను అనుకుని ఆక్వా చెరువులు తవ్వుతుండటంతో సరిహద్దు వరి సాగు రైతులు తవ్వకం పనులు బుధవారం అడ్డుకున్నారు. నక్కావారి పాలెంకు చెందిన పిల్లి శ్రీనివాసరావు, వెంకట నాగరాజు, దంపనబోయిన ప్రసాద్, గుడాల బొండియ్య, గుబ్బల మహలక్ష్మీ, పిల్లి సీతామహలక్ష్మీ, కడలి శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. భీమవరం మండలం వెంప గ్రామానికి చెందిన ఒకరు తమ సరిహద్దులో భూమి కొనుగోలు చేశారన్నారు. ఆ భూమిలో ఆక్వా చెరువులు తవ్వుతున్నారన్నారు. తమ చేలల్లోని మురుగు నీరు వెళ్లే బోదె మార్గం మూసివేశారని మురుగునీరు లాగే పరిస్థితి లేదన్నారు. గత రెండు మూడు పర్యాయాలుగా చెరువు తవ్వే ప్రయత్నం చేయగా తాము అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేయగా అధికారులు తవ్వకాలు నిలిపివేశారన్నారు. మళ్లీ తమ చేలను అనుకుని ఆక్వా చెరువులు తవ్వుతుండటంతో నీటి పారుదలశాఖ మంత్రికి, జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. తమపై ఆక్వా రైతు అక్రమ కేసులు పెట్టిస్తూ బెదిరిస్తున్నారని వాపోయారు. తమకు కనీసం మురుగుబోదె సదుపాయం చూపించి చెరువు తవ్వితే అభ్యంతరం లేదని అంటున్నారు.



గుంటూరులో నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ (ఎన్‌క్యూఏఎస్) సర్టిఫికేషన్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్, తదితరులు

నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ సర్టిఫికేషన్‌లో పశ్చిమకు మొదటి స్థానం

భీమవరం క్రైం, ఆగస్టు 21 : నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ (ఎన్‌క్యూఏఎస్) సర్టిఫికేషన్‌లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లా నిలిచిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ భాగంగా దేశవ్యాప్తంగా అన్ని ఆరోగ్య సంస్థల్లో ఉన్నతమైన నాణ్యతా ప్రమాణాలు పాటించేందుకు వీలుగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో రోగులు పొందుతున్న సేవలు, పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది పనితీరు, మందుల నిర్వహణ తదితర నాణ్యతా ప్రమాణాలు గుర్తించి కేంద్ర బృందాలచే సర్టిఫికేషన్ ఇస్తారు. బుధవారం గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ అవార్డును జిల్లా నుంచి డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్ అందుకున్నారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.బి భానునాయక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి సూర్య నారాయణ, వైద్య ఆరోగ్య సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



ఆకివీడు, ఆగస్టు 21 : విజయవాడలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకివీడు సమతా నగర్‌కు చెందిన కాట్నాని తారక రామారావు మృతి చెందాడు. ఆయన విజయవాడలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం గురువారం ఆకివీడులోని సమతానగర్‌కు మృతుదేహం తరలించవచ్చునని బంధువులు తెలిపారు. సమతానగర్‌లో విషాదచాయలు అలుముకున్నాయి.

మెరుగు పేరుతో మోసం..

బిహార్ రాష్ట్రానికి చెందిన ఏడుగురి అరెస్టు

భీమవరం క్రైం, ఆగస్టు 21 : ఈనెల 17వ తేదీన భీమవరం మండలం రాయలం గ్రామం ఉప్పగుంట చెర్వు ప్రాంతానికి చెందిన ఒక మహిళను బంగారం, వెండి మెరుగు పేరుతో మోసం చేసిన కేసులో ఏడుగురు బిహారీలను అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ రహ్మాన్ తెలిపారు. వివరాలోకి వెళితే ఉప్పగుంట చెరువు ప్రాంతానికి చెందిన చిట్టి గొల్లమణి అనే మహిళ వద్దకు ఇద్దరు వ్యక్తులు బంగారం, వెండి మెరుగు పెడతామని బంగారం కొట్టేశారు. ఆమె పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు అనంతరం బిహార్‌కు చెందిన ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు

నరసాపురం, ఆగస్టు 21 : నరసాపురం పట్టణంలోని మిషన్ హైస్కూల్ రోడ్డులో మంగళవారం అనుమానస్పద స్థితిలో మృతి చెందిన బ్లెసీ (24) కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యాదగిరి చెప్పారు. బుధవారం బ్లెసీ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టు మార్టం చేయించామన్నారు. వైద్యుల నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు చేపడతామన్నారు. అండమాన్ నికోబార్‌కు చెందిన బ్లెసీ ఇటీవల తల్లితండ్రులతో కలసి పట్టణానికి వచ్చింది. మిషన్ హైస్కూల్ రోడ్డులోని పెద్దమ్మ ఇంటో ఉంటున్నది. మంగళవారం హఠత్తుగా మృతి చెందింది. ఆమె వంటిపై గాయాలున్నాయన్న వాదనలు రావడంతో బ్లెసీ పెద్దమ్మ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 21: అప్పుల బాధ తాళలేక ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డ రైతు చికిత్స పొందుతూ మృతి చెందినట్టు రూరల్ ఎస్సై ప్రసాద్ తెలిపారు. మండలంలోని మాధవరానికి చెందిన పిడకా లక్ష్మణ్ (50) సన్నకారు రైతు. ఆయన పొలం సాగుచేసేందుకు బ్యాంకుల్లో అప్పులు చేసి వాటిని తీర్చలేక ఇబ్బంది పడుతూ ఉండేవాడు. లక్ష్మణ్‌కు ఇద్దరు కుమారులు. వారిద్దరికి పెళ్ళిళ్ల చేశాక అప్పుల బాధ మరింత పెరిగింది. దీంతో మనస్థాపానికి గురైన లక్ష్మణ్ తన చేలకు తెచ్చిన పురుగు మందును మంగళవారం తాగాడు. బంధువులు గమనించి లక్ష్మణ్‌కు వెంటనే తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 21 : రాంగ్‌రూటులో వచ్చిన లారీ మినీ వ్యాన్‌ను ఢీకొనడంతో వ్యాను డ్రైవర్ మృతి చెందాడు. పల్నాడు జిల్లా నర్సరావుపేటకు చెందిన కోటి రెడ్డి (35) నర్సారావుపేట నుంచి విశాఖపట్టణానికి మినీ వ్యాను లోడుతో వెళ్తున్నారు. బుధవారం మధ్యాహ్నం తాడేపల్లిగూడెం బైపాస్‌లో కమ్మవారి కల్యాణమండపం సమీపంలో ఒక లారీ రాంగ్‌రూటులో మినీ వ్యానుకు ఎదురుగా లారీ వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన కోటిరెడ్డిని హైవే పెట్రోలింగ్ పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

బంగారం, వెండి వస్తువులు చోరీ

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 21 : రాత్రి పూట నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బంగారం, వెండి వస్తువులు అపహరించుకుపోయినట్లు పట్టణానికి చెందిన పెదవేగి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబసు తెలిపారు. కిరాణా, టైలరింగ్ చేసుకుంటూ పట్టణంలో జీవనం సాగిస్తున్న రాంబాబు ఈనెల 19వ తేదీ రాత్రి తన ఇంటి వద్ద కుటుంబంతో కలిసి నిద్రపోయారు. 20వ తేదీ ఉదయం రాంబాబు భార్య నిద్రలేచి చూడగా ఇంటి తలుపులు తెరచి ఉండడం చూసింది. వెంటనే చిల్డ్రన్ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చూడగా మంచం కింద బాక్సులో పెట్టిన బంగారం, వెండి వస్తువులు దొంగిలించుకుపోయినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఐఫోన్ కొనలేదని ఎలుకల మందు తినేశాడు

చికిత్స పొందుతూ యువకుడి మృతి


ఏలూరు క్రైం,ఆగస్టు 21 :కూలి పని చేసుకుని జీవించే తల్లి దండ్రులను 17 ఏళ్ళ యువకుడు ఐ ఫోన్ కొనాలని కోరాడు. అయితే తమకు అంత స్తోమత లేదని ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నామని తర్వాత కొంటామని చెప్పారు. అయితే ఆ తల్లిదండ్రులను బెదిరించడానికి ఎలుకల మందు పేస్టు తిన్నాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకు వెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన బండా రామకృష్ణ (17) పదో తరగతి వరకూ చదివి ప్రస్తుతం మోటారు సైకిల్ మెకానిక్ పనులు నేర్చుకుంటున్నాడు. అతనికి ఒక సోదరి ఉండగా ఇటీవల వివాహం చేశారు. తనకు ఐఫోన్ కొనాలని ఇటీవల కోరాడు. అందుకు తల్లిదండ్రులు కుదరదని చెప్పారు. కొనపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తూ ఈనెల 13వ తేదీ ఉదయం ఎలుకలమందు పేస్టు తినేశాడు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ ఎస్ఐ రాజారెడ్డి తన సిబ్బందితో గుంటూరు వెళ్లి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఎంపాక్స్..అప్రమత్తం

మంకీ పాక్స్‌పై వైద్య ఆరోగ్య శాఖ ముందు జాగ్రత్త

పీహెచ్‌సీ సిబ్బందికి, ఏఎన్ఎంలకు అవగాహన

జ్వరం, రొంప, వంటి నొప్పులు, శరీరంపై నీటిపొక్కులు కనిపిస్తే జాగ్రత్త అవసరం



భీమవరం టౌన్,ఆగస్టు 21 : ప్రపంచాన్ని భయపెడుతున్న ఎంపాక్స్ (మంకీ పాక్స్)పై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కింది స్థాయి అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేస్తోంది. ప్రస్తుతం మన ప్రాంతంలో ఈ వ్యాధి కనిపించకపోయినప్పటికీ కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ, కేంద్రంతో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ వైద్య అధికారులను ఆదేశించిన నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఈ వ్యాధికి సంబంధించి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై మెడికల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. వారి ద్వారా పీహెచ్‌సీ సిబ్బందికి గ్రామాల్లో ఉండే ఏఎన్ఎంలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేశారు. ఎక్కడైనా లక్షణాలు ఉన్నవారిని గుర్తిస్తే తీసుకోవలసిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు.

వ్యాధి లక్షణాలు

జ్వరం, రొంప, దగ్గు, వంటినొప్పులు, చర్మం మీద నొప్పితో కూడిన దద్దుర్లు, నీటి పొక్కుల్లాంటివి కనిపిస్తాయి. తీవ్ర అలసట, గొంతులో గరగర, నొప్పి, తీవ్రంగా ఉంటాయి. జ్వరం తగ్గిన తరువాత ముఖం, చేతులు, పొట్ట, వీపు మీద, అరచేతిలో పొక్కులు వస్తే వెంటనే ఎంపాక్స్ నిర్ధారణ పరీక్షలు చేయించాలి. ఎంపాక్స్ వ్యాధి నిర్ధారణ పరీక్షా కేంద్రం ప్రస్తుతం తిరుపతిలో ఉందని వైద్యాధికారులు చెబుతున్నారు. దేశంలో పూణే, న్యూఢిల్లీ, హైదరాబాద్‌తో పాటు 21 చోట్ల పరీక్ష కేంద్రాలున్నాయి.

తీసుకోవలసిన జాగ్రత్తలు

ఈ వ్యాధికి గురైన వారితో సన్నిహితంగా మెలిగినపుడు సంక్రమించే అవకాశం ఉంటుంది. ఒకరి నుంచి మరొకరికి ఈ వ్యాధి సోకే అవకాశం ఎక్కువ. లక్షణాలు కనిపిస్తే అటువంటి వారికి దూరంగా ఉండాలి. ఇంట్లో కుటుంబ సభ్యులు తప్పనిసరిగా మాస్క్ ధరించాలి. వ్యాధి సోకినవారి దుస్తులు, వస్తువులు విడిగా ఉంచాలి.

ప్రమాదికారి కాదు..అశ్రద్ధ వద్దు

ఈ వ్యాధి ప్రమాదికారి కాదని సకాలంలో గుర్తిస్తే సరైన వైద్యం అందితే నివారణ చెయ్యవచ్చునని వైద్యులు చెబుతున్నారు. నిర్లక్ష్యం చేస్తే ఊపిరితిత్తులకు సంబంధించి వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ముందస్తు చర్యలుగా ఐసోలేషన్ వార్డు ఏర్పాటుకు ఆదేశాలు జారీ అయ్యాయి. పరీక్ష కిట్స్ సిద్ధంగా ఉంచేలా ఆలోచన చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఇటువంటి లక్షణాలు ఏమీ లేవని అయినప్పటికీ ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.



తాడేపల్లిగూడెంలో కమిటీ కుర్రోళ్ల సందడి

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 21: గ్రామీణ ప్రాంతాల్లో యువత లైఫ్ స్టైల్ ఆధారంగా నిర్మించిన కమిటీ కుర్రోళ్ల చిత్ర విజయానికి యువత ఆదరణే కారణమని చిత్ర నిర్మాత నిహారిక పేర్కొన్నారు. చిత్ర బృందంతో కలిసి ఆమె తాడేపల్లిగూడెంలో లక్ష్మీనారాయణ థియేటర్ వద్ద సందడి చేశారు. నిహారిక మాట్లాడుతూ చిత్ర దర్శకుడు యదువంశీ, హీరోలు తాడేపల్లిగూడెం ప్రాంతం వాళ్లేనని గుర్తుచేశారు.


కోళ్ల వ్యర్థాల వాహనాన్ని పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కోళ్ల వ్యర్థాల వాహనం పట్టివేత

భీమడోలు, ఆగస్టు 21 : భీమడోలు మండలం లింగంపాడు ప్రాంతంలో చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలు మేతగా వేయడానికి తరలిస్తున్న వాహనాన్ని పోలీసు, రెవెన్యూ, ఫిషరీస్ అధికారులు అడ్డుకున్నారు. లింగంపాడు సమీపంలోని 120 ఎకరాల చేపల చెరువుకు మేత కోసం సుమారు నాలుగు టన్నుల కోళ్ల వ్యర్థాలను తీసుకు వెళ్లారు. చెరువులో వేయడానికి ప్రయత్నిస్తుండగా సమాచారం అందుకున్న అధికారులు అక్కడకు వెళ్లి వాహనాన్ని సీజ్ చేసి వ్యర్థాలను డంపింగ్ యార్డులో పూడ్చి పెట్టారు. చెరువు సాగు చేస్తున్న గంటా మోహనరావుపై కేసు నమోదు చేశారు. అనంతరం భీమడోలు పోలీస్ స్టేషన్‌లో సీఐ రవికుమార్ విలేకరులతో మాట్లాడుతూ కోడి వ్యర్థాలను మేతగా వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గడిచిన 15 రోజులుగా ఆరు కోడి వ్యర్థాల వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశామన్నారు. పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హానికరంగా ఉన్న నిషేధిత కోడి వ్యర్థాలను ఉపయోగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. చట్టాలు కఠినంగా మారాయని దీనికి సంబంధించి రైతులను ముద్దాయిగా చేరుస్తూ కేసులు నమోదు చేస్తామన్నారు.

ఎస్టీ వర్గాల వెనుకబాటుతనాన్ని తొలగించేందుకు చర్యలు : కలెక్టర్



ఎస్టీ కాలనీ వాసులతో మాట్లాడుతున్న కలెక్టర్

భీమవరం టౌన్/భీమవరం రూరల్, ఆగస్టు 21 :జిల్లాలో ఎస్టీ వర్గాల వెనుకబాటుతనాన్ని పూర్తిస్థాయిలో తొలగించేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం గొల్లవానితిప్ప రోడ్డులోని ప్రకాష్ నగర్ ఎస్టీ కాలనీని అధికారులతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వారి జీవన శైలిని పరిశీలించారు. స్థానిక రాజీవ్ క్రాంతి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను, విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. కాలనీవాసులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇళ్ళు నిర్మించి ఇచ్చారని, రోడ్ల కంటే ఇళ్లు లోతట్టులో ఉండడంతో అధిక వర్షాలకు చాలా ఇబ్బందులు పడుతున్నామని, మరుగుదొడ్లు నిర్మించాలని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ అందరికీ మెరుగైన వసతులు కల్పించే లక్ష్యంతో తాను విధుల్లో చేరిననాటి నుంచి జిల్లా అంతటా ఎస్టీ కాలనీల్లో పర్యటిస్తూ నివేదికలను రప్పిస్తున్నామన్నారు. గృహనిర్మాణ పథకం కింద అర్హులైన వారికి ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి, సహాయ కమిషనర్ ఎ.శ్రీవిద్య తహసీల్దార్ రావి రాంబాబు, మున్సిపల్, రెవెన్యూ, మెప్మా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా డ్రెయిన్ల ప్రక్షాళన

జిల్లాలోని రైతుల సంక్షేమానికి బాసటగా నిలిచేందుకు దశలవారీగా డ్రెయిన్ల ప్రక్షాళన చేపడతామని కలెక్టర్ నాగరాణి తెలిపారు. బుధవారం భీమవరం మండలం గూట్లపాడు వద్ద పొలిమేరతిప్ప డ్రెయిన్‌లో జరుగుతున్న కిక్కిస తొలగింపు పనులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. రైతుల అభ్యర్థన మేరకు పొలిమేరతిప్ప డ్రెయిన్‌లో కిక్కిస తొలగింపునకు అత్యవసరంగా భావించి జిల్లా నిధుల నుంచి రూ.5 లక్షలు కేటాయించి పనులు ప్రారంభించామన్నారు. ఈఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్, భీమవరం తహసీల్దార్ రావి రాంబాబు, ఏవో ఎస్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌ను కలిసిన నాయకర్



పార్టీ అధినేత పవన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొమ్మిడి

నరసాపురం, ఆగస్టు 21: ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ బుధవారం పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను అమరావతిలో కలిశారు. నియోజకవర్గంలో పెండింగ్ సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఫిషింగ్ హార్బర్, వారధి, మెరైన్ పోలీస్ స్టేషన్‌ల నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో వేసిన శిలాఫలకాలు, మధ్యస్థంగా నిలిచిన పనులపై చర్చించారు. బొమ్మిడి సునీల్ ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి : ఆరిమిల్లి



ఆలయ ముఖద్వారం ప్రారంభిస్తున్న ఆరిమిల్లి

తణుకు, ఆగస్టు 21: ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం తణుకు రాష్ట్రపతి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయ ముఖద్వారాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఆనంద మస్తాన్‌రావు కుటుంబీకులు రూ. 3 లక్షల 50 వేలతో నిర్మించడం అభినందనీయమన్నారు. తొలుత వేద పండితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్నారు. టీడీపీ నాయకులు కలగర వెంకటకృష్ణ, బసవా రామకృష్ణ, మంత్రిరావు వెంకటరత్నం, వావిలాల సరళాదేవి, గమిని రాంబాబు, తాతపూడి మారుతీరావు, ఒమ్మి రాంబాబు, చింతలపూడి సన్యాసిరావు, ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల సంక్షేమానికి వినతి

వీధుల్లో బండ్లపై తినుబండారాలను అమ్మే వీధి విక్రయదారుల సంక్షేమానికి కృషి చేయాలని బుధవారం సంఘ నాయకులు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను కలిసి విన్నవించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ వీధి విక్రయదారులకు ఉపాధి భద్రత కల్పించాలని, సబ్సిడీపై రుణాలు ఇప్పించాలని కోరారు. అనంతరం సంఘ సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేశారు. సంఘ నాయకులు కిలాని శ్రీనివాసు, రేలంగి రాజు, రవిపతి, బూర సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి శూన్యం : బొలిశెట్టి



రహదారులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బొలిశెట్టి

పెంటపాడు, ఆగస్టు 21: వైసీపీ ప్రభుత్వం నిధులన్నీ దారి మళ్లించడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి లేదని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం ముదునూరులో రూ.12.50లక్షలతో ఆసుపత్రికి వెళ్లే సీసీ రహదారి, జడ్పీ స్కూల్‌కు వెళ్లే గ్రావెల్ రహదారికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముదునూరులో తాగునీరు పూర్తిగా కలుషితమైందని సమస్య పరిష్కరిస్తామన్నారు. ఎంపీపీ దాసరి హైమవతి, కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి, సర్పంచ్ బావన ధాన్యలక్ష్మి, దత్తు ప్రసాద్, బుద్దన బాబులు, బుద్దన నారాయణ, బుద్దన ధనరాజు, పాలూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు మావుళ్లమ్మ ఆలయంలో వరలక్ష్మి వ్రతాలు

భీమవరంటౌన్, ఆగస్టు 21 :మావుళ్ళమ్మ ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం ఉదయం ఏడు గంటలకు ఆలయ ప్రాంగణంలో సామూహిక ఉచిత వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహిస్తున్నట్టు ఈవో బుద్ధ మహాలక్ష్మినగేష్ తెలిపారు. పూజలో పాల్గొనే మహిళలు గురువారం సాయంత్రం లోపు దేవస్థానం కౌంటర్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 21 :స్థానిక మన్యం జగ్గమ్మగారి సత్రంలో ఈనెల 23న మహిళలకు ఉచితంగా ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశామని యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గాప్రసాద్ తెలిపారు. వైద్య శిబిరంలో మణిపాల్ సూపర్ స్పెషాలిటీ వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, వివరాలకు 94901 07208, 89781 22234 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **పాలకొల్లు అర్బన్, ఆగస్టు 21 :** ఆర్టీసీ బస్టాండ్‌లో యాచకులు, జేబు దొంగల బెడద పెరిగిపోతోందని, బస్టాండ్లలోని మూత్రశాలల నిర్వాహకుల దోపిడీ పెరిగిపోయిందని ఆర్టీసీ రీజనల్ మేనేజర్, డిపో మేనేజర్లకు వినియోగదారుల మండలి కార్యదర్శి ముచ్చర్ల బాబూరావు లేఖ రాశారు.
- ఇటీవల మరణించిన సీపీఎం నేత వలవల శ్రీరామమూర్తి సంస్మరణ సభ ఈనెల 25న ఉదయం 9గంటలకు స్థానిక అంబేడ్కర్ భవనంలో నిర్వహిస్తున్నట్టు సీపీఎం కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ తెలిపారు.
- **తాడేపల్లిగూడెం రూరల్ :** గర్భిణులు బలవర్ధక ఆహారం తీసుకోవాలని రామన్నగూడెంలో సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.ఎస్తేరు రాణి సూచించారు. మద్దిపాటి బాబి, వీరాస్వామి పాల్గొన్నారు.
- **అత్తిలి :** అత్తిలి మండలంలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం చేపట్టినట్లు అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి అక్టోబరు ఒకటో తేదీకి 18 ఏళ్లు నిండిన వారిని నమోదు చేస్తున్నట్టు తెలిపారు.





భీమవరం ఆర్టీసీ డిపో వద్ద దళిత నాయకుల ధర్నా.. నరసాపురంలో జాతీయ రహదారిపై మాలమహానాడు నాయకుల రాస్తారోకో

బంద్ సంపూర్ణం

- ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ రాస్తారోకో, మోటారు సైకిళ్ల ర్యాలీ
- మూసివేసిన బ్యాంకులు, విద్యా, వ్యాపార సంస్థలు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా మాల మహానాడు నాయకులు బుధవారం చేపట్టిన బంద్ సంపూర్ణంగా ముగిసింది. బస్ డిపో వద్ద బస్సులు నిలిపివేశారు. పట్టణాల్లో మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. విద్యాసంస్థలు, వ్యాపార దుకాణాలు, బ్యాంకులను మూసి వేయించారు.

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 21 : పాలకొల్లులో నియోజకవర్గ మాలమహానాడు ఐక్య జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం బంద్ సంపూర్ణంగా ముగిసింది. మోటారు సైకిళ్ళపై తిరుగుతూ వ్యాపార సంస్థలను, రవాణా వాహనాలను తిరగకుండా అడ్డుకున్నారు. ఆర్టీసీ స్వచ్ఛందంగా బస్సులు నడపలేదు. విద్యాసంస్థలు, బ్యాంకులు, పోస్టాఫీసు వంటి ప్రభుత్వ సంస్థలను మూయించి వేశారు. లాకుల సెంటర్‌లో నాయకులు రోడ్డుపై బైఠాయించి ఎస్సీ వర్గీకరణ వద్దు ఐక్యతే ముద్దు అంటూ నినాదాలిచ్చారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్, పీవీరావు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు వరప్రసాద్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు మద్దా చంద్రకళ, కోట రత్నరాజు, విప్పర్తి ప్రభాకర్, గుమ్మాపు పెద్దిరాజు, మోకా నరసింహారావు, కొప్రపాటి వీరాస్వామి, దేవ రాజేష్, పితాని పుష్పరాజ్, ఉప్పే పండు, బండి సుందరరామమూర్తి, ఎ.వెంకటరమణ, కర్రి జోగయ్య, టి.ఇస్సాక్, విప్పర్తి నవీన్, కె.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

● నరసాపురం టౌన్/మొగల్తూరు : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బుధవారం మాల న్యాయ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన భారత్ బంద్ నరసాపురంలో విజయవంతమైంది. హైవేపై నాయకులు బైఠాయించి రాస్తారోకో చేశారు. యువకులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మాధవాయిపాలెం రేవులో పంటు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాయకులు సోడదాశి శ్రీధర్, కాకిలేటి ఆనంద్, తాడి లక్ష్మణరావు, దొండపాటి వెంకట్, పీతల మనోహర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయడం దారుణమన్నారు. దొండపాటి స్వామి, వెంకట్రావు, నల్లి జెవీఆర్, బత్తుల శ్రీను, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. మొగల్తూరు మండలం మొగల్తూరు గాంధీబొమ్మల సెంటర్‌లో మాలమహానాడు నాయకులు కొద్దిసేపు నిరసన తెలిపారు. ఆందోళనలో మండల మాలమహానాడు అధ్యక్షులు కుమారస్వామి, డొల్లా రత్నంరాజు, వర్ధనపు సుధాకర్, పడవల సత్యనారాయణ, కొండా ఆదాము, మద్దూరి పెద్దిరాజు, వడ్లమూడి శ్రీను, ఇంజేటి దానం, నల్లి నాగరాజు, ఇంజేటి రాజు, వేగి రాజశేఖర్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

● భీమవరం అర్బన్ : భీమవరంలో దళిత సంఘాల నాయకులు ఉదయం నుంచి బస్ డిపో వద్ద బస్సులను నిలిపివేశారు. పట్టణంలో మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. దళిత సంఘాల నాయకులు కోనా జోసెఫ్, తాళ్లూరి మధు, గంటా సుందర్ కుమార్, పోనమండ బాలకృష్ణ, జి.నగేష్, బిరుదుగడ్డ రమేష్, ఎలేటి న్యూటన్, పాలపర్తి జోనా, జి.రాజ్‌కుమార్, జి.ప్రభు తదితరులు పాల్గొన్నారు.

● కాళ్ళ/ఉండి : కాళ్ల మండలంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. స్వచ్ఛందంగా వ్యాపారస్తులు దుకాణాలు, పాఠశాలలు, బ్యాంక్‌లు మూసివేశారు. ఏలూరుపాడులో అంబేడ్కర్ యువజన సంఘం యువకులు దుకాణాలు, పాఠశాలలు మూసివేసి నిరసన తెలిపారు. ఉండి మండలం ఉండి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ సారథ్యంలో బంద్ నిర్వహించారు. చిగురుపాటి రాజేష్, మేడిది సాయిజగన్నాథ్, పారుపూని రాహుల్, సూరిబాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

● ఆచంట/పోడూరు/పెనుగొండ/పెనుమంట్ర : ఆచంట మండలంలో ఎస్సీ సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఆచంట కచేరి సెంటర్‌లో మాలమహానాడు సంఘం నేతలు నిరసన వ్యక్తం చేశారు. కోట వెంకటేశ్వరరావు, పారుపల్లి సుందరపాల్, బీరా నరసింహమూర్తి, సుంకర సీతారామ్, సరెళ్ళ శ్రీనివాసు, మట్టా ఆనంద్‌కుమార్, కారెం సంజయ్ పాల్గొన్నారు. పోడూరు మండలంలో మాల మహానాడు, జేఏసీ ఆధ్వర్యంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. వ్యాపార దుకాణాలు, వాణిజ్య బ్యాంకులు స్వచ్ఛందంగా మూసివేశారు. పెనుగొండ మండలం సిద్ధాంతంలో స్వచ్ఛందంగా షాపులు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు మూసి వేశారు. ర్యాలీలో పులిదిండి వెంకటేశ్వరరావు, చికిలే కృష్ణబాబు పాల్గొన్నారు. పెనుమంట్ర మండలం మార్టేరు సెంటర్లో మాల మహానాడు ఆధ్వర్యంలో మానవహారం, అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. నాయకులు ఉన్నమట్ల ముని బాబు, మట్టా రాము, సుంకర సీతారాం, ఈద్ ప్రవీణ్, బుర్ర రవికుమార్ పాల్గొన్నారు.

● అత్తిలి : అత్తిలిలో దళిత నాయకులు బంద్ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని మానవహారంతో నిరసన తెలిపారు. దళిత నాయకులు పి.వినయ్‌బాబు, బట్టు నాగరాజు, కోరుకొల్లు వెంకట్రావు, సుజన్‌కుమార్, సబ్బితి రాజేష్, ధర్మారావు, యాళ్ళ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పార్కు చుట్టూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

భీమవరంటౌన్, ఆగస్టు 21 :బీవీ రాజు మున్సిపల్ పార్కు చుట్టూ ఆక్రమణలకు గురికాకుండా చూస్తామని, ఆ ప్రాంతాన్ని సుందరీకరణ చేయాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బీవీ రాజు మున్సిపల్ పార్కు పరిసర ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామలతో కలిసి ఆయన పరిశీలించారు. పార్కు మెయిన్ గేట్ వద్ద ఉన్న వ్యాపారస్తులు రోడ్డు మీదకు ఆక్రమణలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత మున్సిపల్ పైపులైన్‌ను పరిశీలించారు. జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, ఆకుల కృష్ణ, వీర మహిళలు పాల్గొన్నారు.

హాస్టల్‌లో వసతులను సద్వినియోగం చేసుకోవాలి

పోడూరు, ఆగస్టు 21: ప్రభుత్వం హాస్టల్‌లో అన్ని వసతులు కల్పిస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుకోవాలని తహసీల్దార్ సయ్యద్ మౌలాన ఫాజిల్ సూచించారు. పోడూరు బీసీ బాలుర హాస్టల్‌ను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్‌లోని అన్ని గదులను పరిశీలించారు. బియ్యం, సరుకుల నిల్వలు, మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్న వంటకాలను పరిశీలించారు. ఆహారం రుచి శుభ్రతపై విద్యార్థులను ఆయన అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కడిమి శ్రీనివాస దుర్గాప్రసాదరావుకు పలు సూచనలు చేశారు. ఆర్ఐ కందుల రాంబాబు, వీఆర్వో కుమార్ ఉన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

అత్తిలి, ఆగస్టు 21 : అత్తిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ అతిథి అధ్యాపక పోస్టు కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి కోరారు. ఆసక్తి గల వారు ఈనెల 23 లోగా దరఖాస్తు చేసుకోవాలని 24న ఇంటర్వ్యూ ఉంటుందని పద్మావతి తెలిపారు.

ఎమ్మెల్యే రఘురామకు కృతజ్ఞతలు : శాంతికుమారి

ఉండి ఆగస్టు 21: గ్రామ ప్రజలకు మంచినీరు ఇచ్చేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్న ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజుకు గ్రామం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పాములపర్రు సర్పంచ్ కేశన శాంతికుమారి బలుసులరావు, ఉపసర్పంచ్ వెంకటేశ్వరరావు చెప్పారు. బుధవారం ఉండి నుంచి పాములపర్రు వెళ్లే పంట కాల్వలో చెత్త, గుర్రపుడెక్క, పూడికపోయిన మట్టిని ఎక్స్‌కవేటర్‌తో తొలగింపు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణాధికారి పొత్తూరి వెంకటేశ్వరరాజు, గ్రామ అధ్యక్షుడు కేశన యాదగిరి, వర్రే సముద్రమూర్తి, తోట రాము, కోటి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం

భీమవరం టౌన్, ఆగస్టు 21 : ఆదాయపు పన్ను మినహాయింపు ప్రతీ నెలా వారి పెన్షన్ నుంచి మినహాయించమని కోరిన వారికి కొత్త స్లాబ్స్‌లో మినహాయింపు చేయిస్తామని జిల్లా ట్రెజరీ ఎ.గణేష్ తెలిపారు. కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఏపీ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కో-ఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి కో-ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహిస్తామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు పొందిన జిల్లా అధికారి ఎ.గణేష్, సీనియర్ అకౌంటెంట్ జగదీశ్వరరాజు, సహాయకులు సూర్యనారాయణలను రిటైర్డు ఉద్యోగుల సంఘం తరపున సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు గాతల జేమ్స్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాగిరాజు సత్యనారాయణ రాజు, ట్రెజరర్ రవిప్రసాద్ తదితరులు ఉన్నారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కమిటీకి అభినందనలు

ఉండి ఆగస్టు 21: నూతనంగా ఎన్నికైన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు. బుధవారం ఉండిలో ఎస్సీ స్పెషల్ పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించి కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా పి.శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శిగా డి.రాజేష్, ఆర్థిక కార్యదర్శిగా వై.శ్యాంప్రసాద్, మహిళా కార్యదర్శిగా టీడీసీ కళావతి, గౌరవాధ్యక్షుడిగా వై.రమేష్‌లను ఎన్నుకున్నట్టు తెలిపారు. పెన్మెత్స వెంకట సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

'పొత్తూరి'కి పలువురి పరామర్శ

నరసాపురం రూరల్, ఆగస్టు 21: యలమంచిలి మండలం వైవీలంకలో టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజును బుధవారం శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు పరామర్శించారు. పొత్తూరి తండ్రి నర్సింహరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, వాతాడి ఉమా, షేక్ హుసేన్, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి యువత సేవా కార్యక్రమాలు

తాడేపల్లిగూడెం రూరల్/మొగల్తూరు, ఆగస్టు 21: సినీ హీరో చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా తాడేపల్లిగూడెం పట్టణంలోని హౌసింగ్ బోర్డులో చిరంజీవి యువత ఆధ్వర్యంలో అనాథ కుటుంబాలకు బుధవారం నిత్యావసర సరుకులు, వస్త్రాలు అందించారు. చిరంజీవి యువత రాష్ట్ర కార్యదర్శి గట్టు గోపీకృష్ణ, నాయకులు ఆకుల నరసింహమూర్తి, మోటూరి సుబ్రహ్మణ్యం, రాగిరెడ్డి త్రినాథ్, వట్టి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మొగల్తూరు మండలం రామన్నపాలెంలో చిరు అభిమానులు తైవాన్ జామ మొక్కలు పంపిణీ చేశారు. చిరు అభిమాన సంఘాల జిల్లా అధ్యక్షుడు కోపెల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ చిరు, పవన్ అభిమానులు వారం రోజుల పాటు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు అంజనా సత్తిబాబు, కొల్లాటి గోపి, సర్పంచ్ ఎలీషా, ఉపసర్పంచ్ మేకల అజా ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పిప్పళ్ళ రాంబాబు, పిప్పళ్ళ సత్య ప్రసాద్, సత్యనారాయణ, ఇంటి ఏడుకొండలు, ఆకన నరేష్, ప్రకాష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఆకివీడు/పాలకొల్లు రూరల్, ఆగస్టు 21 : ఆక్వా రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ రాంబాబు అన్నారు. బుధవారం స్థానిక మత్స్యశాఖ అభివృద్ధి కార్యాలయంలో ఆక్వా రైతులకు అప్సుడా, ఎంపెడా అనుమతులపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఉండి కేవీపీ శాస్త్రవేత్త శ్రీనివాస్, ఆక్వా డీలర్లు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు, కె.రాంబాబు తదితరులు ఉన్నారు. పాలకొల్లు రూరల్ చందపర్రు కల్యాణమండపంలో అప్సుడా, ఎంపెడా సంస్థల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా ఆనందరావు మాట్లాడుతూ ఆక్వా రైతులు తాము పండించిన పంట వివరాలను, విస్తీర్ణాన్ని, ఏ ఫ్యాక్టరీ ద్వారా సీడ్‌ను తీసుకున్నారు. తదితర వివరాలను కేంద్ర ప్రభుత్వ నవోదయ సంస్థలో నమోదు చేసుకోవడం ద్వారా ఆక్వా రైతులకు మేలు కలుగుతుందన్నారు. ఇన్‌చార్జి ఎఫ్‌డీవో రాజా, జిల్లా మత్స్య శాఖ అధికారి భాను నరసయ్య, ఆక్వా రైతులు కోడి విజయభాస్కర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను పరిశీలించిన అధికారులు

నరసాపురం రూరల్, ఆగస్టు 21: ప్రభుత్వం 80శాతం సబ్సిడీపై సరఫరా చేసిన విత్తనాల్లో మొలకెత్తాయి అనే వార్త ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన నేపథ్యంలో వ్యవసాయశాఖ అధికారులు, ఏపీ సీడ్ సిబ్బంది స్పందించారు. బుధవారం వైఎస్‌పాలెం గ్రామంలో సరఫరా చేసిన విత్తనాలను వ్యవసాయ శాఖ ఏడీఈ అనిల్‌కుమారి పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు సేకరించారు. సీడ్‌లో వచ్చిన విత్తనాలు పిలకలు రావడంతో వాటిని ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. సరఫరా విత్తనాలపై అనుమానాలు ఉంటే రైతులు వ్యవసాయశాఖ దృష్టికి తీసుకురావాలన్నారు. మాజీ సర్పంచ్ వైఎస్ బాబులు, వాసు, ఏఈవో నారాయణ ఉన్నారు.

'సత్యమార్గాన్ని తెలిపేదే వామన చరిత్ర'

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 21: సత్య మార్గాన్ని విడవరాదని తెలియ చెప్పేదే వామన చరిత్ర అని, వామనుడికి ఇచ్చిన మాటను తప్పని బలి చక్రవర్తి పురాణ ప్రసిద్ధమని ఆధ్యాత్మిక వేత్త చాగంటి లింగరాజు అన్నారు. స్థానిక శంకర మఠంలో రెండోరోజు బుధవారం రాత్రి టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమంలో ఆయన వామన చరిత్రను వివరించారు. సంస్కృత విశ్రాంత అధ్యాపకులు వీకే సత్యనారాయణ, పోతుల సూర్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు సత్తిరాజు కేశవరావు, వీవీఎస్ఎన్ ప్రసాద్, అర్చకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం

అత్తిలి, ఆగస్టు 21 : అత్తిలిలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా గడ్డం కిరణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వినయ్, ఉపాధ్యక్షుడిగా ఎం.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, కార్య నిర్వహణ కార్యదర్శిగా తానేటి మోహన్, కార్యదర్శిగా కోడెల సత్యమూర్తిరాజు తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ అత్తిలిలోని మండల స్థాయి అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.

భర్త అదృశ్యం..

ఉండి, ఆగస్టు 21: తన భర్త ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని, బంధువులు, చుట్టుపక్కల వారి ఇళ్లల్లో ఆచూకీ తెలియలేదని భార్య సీతామహాలక్ష్మి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. పాందువ్వ పంచాయతీ పరిధిలోని ఖండికకు చెందిన పసుపులేటి ప్రభాకర్‌రావు మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఈనెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని పోలీసులకు తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.



భీమవరంలో న్యాయవాదుల ర్యాలీ

వైద్యులకు రక్షణ కల్పించాలి

- జూనియర్ డాక్టర్ హత్యాచారంపై నిరసనల వెల్లువ

భీమవరం అర్బన్/భీమవరం క్రైం/ఆకివీడు, ఆగస్టు 21: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థిని అత్యాచార హత్యను ఖండిస్తూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. వైద్యులకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు బి.వాసుదేవరావు, కలిపిండి సత్యనారాయణ, పి.శ్రీను, మాధవి, నాని బంగారు గణేష్ పాల్గొన్నారు. భీమవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పెద్దఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. తొలుత ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న కోర్టుల ప్రాంగణం నుంచి బయలుదేరి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి యేలేటి న్యూటన్, వెంకట్రావు మాట్లాడారు. న్యాయవాదులు రేలంగి హరి, చెల్లబోయిన రంగారావు తదితరులు పాల్గొన్నారు.

● ఆకివీడులో ఆదిత్య విద్యా సంస్థల అధినేత ఉండ్రమట్ల సాంబశివరావు ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఐద్వా జిల్లా నాయకురాలు కల్యాణి తదితరులు ఉన్నారు.

టీచర్ల ఎమ్మెల్సీ ఓట్లను నమోదు చేసుకోవాలి

కాళ్ళ/ఆచంట/గణపవరం, ఆగస్టు 21:ఏదైనా పాఠశాల, కాలేజీలలో మూడేళ్లు ఉపాధ్యాయులుగా పనిచేసిన వారు టీచర్ల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు అర్హులని కాళ్ల ఇన్‌చార్జి తహసీల్దార్ నాగార్జున తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు, పశ్చిమ ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి కొత్త ఓటర్ల జాబితాను తయారు చేయాలన్నారు. ఓటు నమోదుకు సెప్టెంబరు మూడో తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో స్వాతి, అధికారులు పాల్గొన్నారు. ఆచంట మండలంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సుగుణ సంధ్య ఆధ్వర్యంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. గణపవరం మండలంలో తహసీల్దార్ అప్పారావు ఆధ్వర్యంలో ఓటర్ల నమోదుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్, ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తులు లభిస్తాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి : సీపీఎం

ఆకివీడు, ఆగస్టు 21:విజృంభిస్తున్న విషజ్వరాలను అదుపుచేసేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు కోరారు. బుధవారం స్థానిక యూపీహెచ్‌సీ సూపరింటెండెంట్, వైద్యుడు వెంకటపతిరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. బీవీ వర్మ, డోకల రవితేజ, పెంకి అప్పారావు తదితరులు ఉన్నారు.

మార్చిలోగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

అత్తిలి, ఆగస్టు 21 : 2025 మార్చిలోపు గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆ శాఖ తణుకు డీఈ ప్రసాద్ అన్నారు. అత్తిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. కొత్త ప్రభుత్వం చేపట్టే పథకం వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రారంభం అవుతుందన్నారు. కాలనీలో అంతర్గత రహదారులు నిమిత్తం ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. అత్తిలి పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉందని వైద్యాధికారిణి తెలిపారు. మంచిలి ఆరోగ్య కేంద్రానికి నైట్ వాచ్‌మన్‌ను నియమించాలని వైద్యాధికారి చాముండేశ్వరి కోరారు. సెప్టెంబరు మూడు నుంచి ప్రారంభం అయ్యే రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని తహసిల్దార్ దశిక వంశీ కోరారు. తణుకు ఐసీడీఎస్ సీడీపీవో ప్రమోద్‌కుమారి, జడ్పీటీసీ జానకి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు హబీబుద్దీన్, మండల పరిషత్ ఏవో రామారావు, ఎంపీడీవో అమల్‌జమ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

తాడేపల్లిగూడెం రూరల్/భీమవరం క్రైం, ఆగస్టు 21: తాడేపల్లిగూడెం, భీమవరం పట్టణాల్లో సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని తాడేపల్లిగూడెం మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ షేక్ సికిందర్ బాషా, భీమవరంలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో భీమవరం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వై.యోహాన్ అన్నారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్, అన్నిరకాల సివిల్ కేసులు, బీఎస్ఎన్ఎల్ తదితర కేసులపై రాజీ చేసేందుకు వీలుంటుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.